క్లుప్తంగా

నేడు రైతులతో సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. రాయచోటి – చాగలమర్రి హైవే రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రొద్దుటూరు మండలంలో భూములు కోల్పోయిన గోపవరం, ప్రొద్దుటూరు, నంగనూరుపల్లె, కొత్తపల్లె గ్రామాలకు సంబంధించిన రైతులు హాజరు కావాలని ఆయన కోరారు. మండలంలో మొత్తం 91 ఎకరాల భూమిని సేకరించామన్నారు.

అక్షింతలు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : అయోధ్య శ్రీరాముని అక్షింతలను స్థానిక గ్రీన్ ల్యాండ్‌కాలనీ కమిటీ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. సంజీవనగర్, స్వరాజ్‌నగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో శ్రీరాముల అక్షింతలను, అయోధ్య రామమందిరం ఫొటోను ఇంటింటికి వెళ్లి అందించారు. ఈనెల 22న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందని, ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని వీక్షించాలని కోరారు.

అంగన్‌వాడీల నిరసన

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా శుక్రవారం మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, ఏఐటీయూసీ, సీఐటీయూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

గోడపత్రాల ఆవిష్కరణ



గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

మైదుకూరు : ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రెడ్ పవర్ డైరీ ఆవిష్కరణ సభకు అందరూ తరలి రావాలని యూనియన్ నాయకుడు నానుబాల ఈశ్వరయ్య తెలిపారు. ఈనెల 21న కడప నగరంలోని జెడ్పీ హాల్‌లో రెడ్ పవర్ డైరీ ఆవిష్కరణ సభా కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రాలను శుక్రవారం మైదుకూరులో ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ కార్మికులు, ఉద్యోగులు, గ్రేడ్-2 జేఎల్ఎంలు, బిల్లింగ్ రీడర్స్ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణ, ప్రమీల, ప్రతాప్‌రెడ్డి, బాలయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లాక్ టవర్ నిర్మాణానికి సాయిల్ టెస్ట్



సాయిల్ టెస్ట్‌ను పరిశీలిస్తున్న పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో నిర్మించనున్న క్లాక్ టవర్ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు శుక్రవారం సాయిల్ టెస్ట్ నిర్వహించారు. పట్టణ సుందరీకరణలో భాగంగా సుమారు రూ.2కోట్ల వ్యయంతో క్లాక్ టవర్ నిర్మించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం సాయిల్ టెస్ట్ నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడారు.

ఎన్జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ

చాపాడు : మైదుకూరు తాలూకా ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ 2024 సంవత్సర క్యాలెండర్‌ను మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాలూకాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం అన్ని విషయాల్లో సానుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో మైదుకూరు తాలూకా ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జల చంద్రమౌళి, సెక్రటరీ మాచనూరు రఘురామయ్య, అసోసియేటెడ్ అధ్యక్షుడు మల్లికార్జున, కోశాధికారి బాబు, ఉపాధ్యక్షులు ప్రభాకర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు వినతి

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ సర్వే నెంబర్ 1008/2ఎ1లో గత పది సంవత్సరాలుగా నివాసముంటున్న పేదలకు హైకోర్టు ఇచ్చిన 28454/2023 ఉత్తర్వులను అమలు చేయాలని శుక్రవారం సీపీఐ నాయకులు తహసీల్దారు గంగయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి మస్తాన్, పట్టణ సహాయ కార్యదర్శి కేశవులు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిలో ఇండ్లు నిర్మించుకుని నివాసముంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. అందువల్ల తామే కోర్టును ఆశ్రయించి న్యాయం కోసం పోరాటం చేయక తప్పలేదన్నారు. కోర్టు పేదలకు ఇంటిపట్టాలు ఇచ్చేలా ఉత్తర్వులు ఇచ్చిందని సదరు కోర్టు ఉత్తర్వులు అమలు చేసి పేదలకు న్యాయం చేయాలని తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సామాజిక న్యాయం

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి దళితులు పెద్ద సంఖ్యలో శుక్రవారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో తొలి మారు అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం న్యాయం చేస్తోందన్నారు. దళిత మహిళకు అత్యున్నతమైన హోం మంత్రి పదవి ఇవ్వడం చరిత్రలో మరచిపోలేనిదన్నారు. ఇదే వర్గానికి చెందిన పలువురికి మంత్రి పదవులతో పాటు కార్పొరేషన్ చైర్మన్ పదవులను ప్రభుత్వం కట్టబెట్టిందని తెలిపారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు నిజంగా జగన్ మాత్రమే కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ జేష్టాది శారద, సోములవారిపల్లె సర్పంచ్ మోపూరి ప్రశాంతి, కౌన్సిలర్లు సత్యం, గుర్రం లావణ్య ప్రకాష్, పిట్టా బాలాజీ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి న్యూకర్ భాస్కర్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్, ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాదిగ, రామాపురం యాకోబ్, గడ్డం సురేష్, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, ఓబన్న, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు గాలి పోతుల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడకు బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి వెళుతున్న దళిత నాయకులతో ఎమ్మెల్యే సుధ

అంబేడ్కర్ ఆశయసాధన జగన్‌తోనే సాధ్యం

బద్వేలు అర్బన్ : అంబేడ్కర్ ఆశయసాధన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. విజయవాడలోని స్వరాజ్య మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన 125 అడుగుల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా దళిత ప్రజాప్రతినిధులు, దళిత నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ కాంస్య విగ్రహం దేశానికే తలమానికంగా నిలవనుందన్నారు. అంబేడ్కర్ కలలను నిజం చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. జాతి యావత్తు గర్వించేలా రూ.400 కోట్లతో 125 అడుగుల భారీ అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింగమాల వెంకటేశ్వర్లు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ నారాయణ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు ప్రతాప్, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు..

బి.కోడూరు : విజయవాడలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి బి.కోడూరు మండలం నుంచి జెడ్పీటీసీ సంగటి దావీదు ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలాన్ని పుణికి పుచ్చుకుని పరిపాలిస్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన పరిపాలనలో ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం లభించడంతో పాటు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందాయని తెలిపారు. టీడీపీ నేతలు ప్రస్తుతం కళ్లబొల్లి మాటలతో ఎస్సీ, ఎస్టీలపై ఎనలేని ప్రేమ చూపుతున్నారని, అలాంటి వారి మాటలు నమ్మవద్దని, గతంలో టీడీపీ నేతలు ఎస్సీ, ఎస్టీలపై మాట్లాడిన నీచపు మాటలు మనమంతా చూశామని, నాడు తలదించి నడిచిన బడుగు, బలహీన వర్గాల ప్రజలు నేడు తల ఎత్తుకునేలా వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగివేమన జయంతి

ప్రొద్దుటూరు : యోగివేమన జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక శివాలయం వీధిలోని వేమన విగ్రహానికి పలు సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెడ్డి జనసంఘ్ ప్రొద్దుటూరు అధ్యక్షుడు బీవీ సుబ్బారెడ్డి, రేనాటి సూర్యచంద్రుల సంస్థ అధ్యక్షుడు డాక్టర్ స్వరూప్ కుమార్‌రెడ్డి, వేమన సేవా సమితి గౌరవాధ్యక్షులు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు ఎం.సూర్యనారాయణరెడ్డి, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అట్లా నరసింహారెడ్డి, సంజీవరెడ్డి, అంకాల కొండయ్య, సాయికుమార్, యడవల్లి రమణయ్య, దొంతు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీలో...

స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీలో యోగివేమన జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.నాగరాజు, డీన్ ఆచార్య కేవీ రమణయ్య, అధ్యాపకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ హయాంలో కడపలో వేమన పేరు మీద యోగివేమన యూనివర్సిటీని ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.జయచంద్రారెడ్డి, ఆచార్య బి.జయరామిరెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



శివాలయం వీధిలోని యోగివేమన విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సంఘాల నాయకులు

ముమ్మరంగా కులగణన సర్వే

గోపవరం : మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో కులగణన సర్వే ముమ్మరంగా ప్రారంభించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి ఇంటింటికి వెళ్లి కులగణన సర్వే నిర్వహిస్తున్నారు. వలంటీర్లు నిర్వహిస్తున్న సర్వేను ఎప్పటికప్పుడు క్లస్టర్ల వారీగా కేటాయించిన సచివాలయ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 19 నుండి 28వ తేదీలోపు కులగణన సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు పెట్టడంతో అన్ని సచివాలయాల పరిధిలో కులగణను సర్వేను ప్రారంభించారు. ఇప్పటికే కులగణన సర్వేపై సచివాలయ సిబ్బందికి ఒక్కరోజు పాటు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. కులగణన సర్వే పారదర్శకంగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజ సిబ్బందిని ఆదేశించారు. గోపవరం సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న కులగణన సర్వేను డీడీఓ విజయకుమార్ పర్యవేక్షించారు.



చిన్న గోపవరంలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న డీడీఓ విజయకుమార్

బీసీ గర్జన జయప్రదం చేయండి

బద్వేలు అర్బన్ : కడప నగరంలోని కళాక్షేత్రంలో ఈనెల 21న జరగనున్న బీసీ గర్జన సభను జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సిద్దవటం రోడ్డులోని పొరవేదిక కార్యాలయంలో బీసీ గర్జన గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల న్యాయమైన కోర్కెలు, డిమాండ్ల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా ఏర్పాటు చేసిన ఈ సభకు నియోజకవర్గంలోని బీసీ సంఘాల నాయకులు, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీ సోదరులు పెద్ద ఎత్తున హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పొరవేదిక పట్టణ కన్వీనర్ ఎస్.వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పీరయ్య, ఆవాజ్ పట్టణ అధ్యక్షుడు సత్తార్ తదితరులు పాల్గొన్నారు.



బీసీ గర్జన గోడపత్రాలను విడుదల చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

వరిపంటను పరిశీలించిన అధికారులు



గోపవరం : అడవి పందుల బారిన పడిన వరిపంటను పరిశీలిస్తున్న అటవీ, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది



చాపాడు : ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ మ్యాగీ

గోపవరం : మండలంలోని గోపవరం పంచాయతీ పరిధిలోని సంగసముద్రం, గోపవరం గ్రామాల్లో అడవి పందుల కారణంగా దెబ్బతిన్న వరిపంట పొలాలను శుక్రవారం అటవీ, రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది పరిశీలించారు. పంట కోత దశలో అడవి పందులు పంటను నాశనం చేయడంతో బాధిత రైతులు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా 1902కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ప్రభుత్వం అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు బద్వేలు ఎఫ్ఆర్ఓ వెంకటశేషయ్య ఆదేశాల మేరకు అటవీ సిబ్బంది సువర్ణకుమార్, ఖాజావలి, వీఆర్ఓ వెంకటేశ్వర్లు, వీఏఏ విజయకుమార్‌లు బాధిత రైతుల పొలాలను పరిశీలించారు. ఆరుగాలం శ్రమించి పంట కోతకు వచ్చే దశలో అడవి పందులు పంటను పూర్తిగా నాశనం చేయడంతో బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట నమోదు ఆధారంగా రైతుల వివరాలను పరిశీలనకు వచ్చిన సిబ్బంది సేకరించారు. సంగసముద్రం గ్రామంలోనే సుమారు 10 ఎకరాలకు పైగా పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు సిబ్బంది గుర్తించారు. నష్టపోయిన పంట వివరాలను అధికారులకు నివేదిక అందజేస్తామని రైతులకు తెలిపారు.

వరి పంట పరిశీలన

చాపాడు : మండల పరిధిలోని పెన్నా – కుందూ పరివాహక ప్రాంతంలో రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంట ఎండిపోతున్నది. నక్కలదిన్నె వద్ద ఎండిన వరి పంటను శుక్రవారం మండల వ్యవసాయాధికారి మ్యాగీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రెండో సారి సాగు చేసిన వరిపంట ఎండుతున్నది, రైతులు ఎకరాకు 40 కేజీల యూరియా, 29 కేజీల పొటాషియం వేయాలని తెలిపారు. అలాగే రైతుల సూచనల మేరకు వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలను పంటల పరిశీలనకు పంపాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారికి సూచించామన్నారు. రైతులు వేసవిలో వరి సాగు స్థానంలో ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే పలు అంశాలపై అవగాహన కల్పించారు.

కడప అగ్రికల్చర్ : కడప మండల పరిధిలోని పాత కడప, మోడమీదిపల్లె గ్రామాలలో శుక్రవారం కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ పరిశోధనస్థానం ప్రధాన శాస్త్రవేత్తలైన డాక్టర్ శ్రీనివాసచారి, జాన్సన్‌లతో కలిసి రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి వరిపంటను పరిశీలించారు. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో సాగు చేసిన వరిపంట అక్కడక్కడ దెబ్బతినడంతో పాటు వరి మొలకలు చనిపోతుండడంతో పలువురు రైతులు ఆయన దృష్టికి తేవడంతో ఆయన శాస్త్రవేత్తలతో కలిసి వరిపంటను పరిశీలించారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : కార్మిక వర్గాలు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కలిగి వాటివల్ల కలిగే ప్రయోజనాలను పొందాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రతినిధి శాంత పిలుపునిచ్చారు. శుక్రవారం న్యాయమూర్తి బాబా ఫక్రుద్దీన్ ఆదేశాల మేరకు కడప నగరం ఇండస్ట్రియల్ ఎస్టేట్లో ఉన్న పవన్ కెమికల్స్‌లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ చట్టాలు, నీటి ప్రాముఖ్యత, ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పని చేసే చోట తప్పనిసరిగా ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కలిగించేలా యాజమాన్యం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. అలాగే లీగల్ ఎయిడ్ క్లినిక్, లోకాయుక్త, కార్మిక చట్టాలు తదితర అంశాలను వివరించారు. బాధితులు నష్టపోతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, పారా లీగల్ వాలంటీర్ ఎస్.దశరథ రామిరెడ్డి, పవన్ కెమికల్స్ యాజమాన్యం, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రతినిధి శాంత

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



ఖాజీపేట : వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



ప్రొద్దుటూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందిస్తున్న దృశ్యం



దువ్వూరు : ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖాజీపేట : ప్రజలందరి ఆరోగ్యం సురక్షితంగా ఉండాలన్న లక్ష్యంతోనే వైఎస్సార్ జగనన్న సురక్ష పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లె గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. శిబిరాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పరిశీలించారు. ప్రజలకు అందే వైద్య పరీక్షలును అడిగి తెలుసుకున్నారు. కంటి వైద్య సేవలు గతంలో చేసుకున్న వారికి కంటి అద్దాలు పూర్తిగా అందాయా ఇంకా ఎంత మందికి రావాల్సి ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అద్దాలు అందరికి అందించామని జరగాల్సిన సురక్షా కార్యక్రమంలోని వారికి మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెవాసుల ఆరోగ్యం పదిలంగా ఉండాలని జగనన్న ఆరోగ్య సురక్షను ప్రభుత్వం చేపడుతోందన్నారు. గ్రామస్తులు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని అవసరమైన చికిత్సను తీసుకోవాలన్నారు. గ్రామస్తులకు వైద్య సేవలనందిస్తున్న వైద్య సిబ్బంది పనితీరును అభినందించారు.

రూ.7 లక్షల మంజూరు

చెన్నముక్కపల్లె చర్చి ప్రహరీ గోడతోపాటు పలు మరమ్మతుల కోసం రూ.7 లక్షల నిధులను ఎమ్మెల్యే మంజూరు చేయించారు. వెంటనే పనులు మొదలు పెట్టి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రహదారి నిర్మాణంతోపాటు పలు రకాల పనులను ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. అధికారులతో మాట్లాడి వెంటనే పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అబూబకర్ సిద్దిక్, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్, బుజ్జి, తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైద్య సేవలు

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని చౌడూరు గ్రామంలో శుక్రవారం కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ బాబా ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు హనీఫ్‌బాబా, హిమబిందు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ కేజే రఘురామిరెడ్డి వైద్య సేవలు అందించారు. 351 మంది గ్రామస్తులకు వివిధ రకాల జబ్బులకు వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రుడు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, సీహెచ్ఓ కృష్ణమ్మ, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, చంద్రకళ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య శిబిరం తనిఖీ

దువ్వూరు : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సునీత కులదీప్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చింతకుంట-2 సచివాలయం పరిధిలో మీర్జఖాన్‌పల్లె గ్రామంలోని నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ వైద్య శిబిరాన్ని చింతకుంట సర్పంచ్ కోగటం వీరారెడ్డి, ఎంపీటీసీ బొమ్మిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన 302 మంది రోగులకు డాక్టర్లు వికసిత, శ్రీలత, నాగయ్య, చంద్రమౌళిలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం ప్రజలకు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్లు సువర్ణ, రాజగోపాల్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

కడప కల్చరల్ : జీవిత బీమా సంస్థ ప్రీమియంలపై జీఎస్టీని పూర్తిగా తొలగించాలని సంస్థ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం 67వ జీవిత బీమా జాతీయకరణ దినోత్సవ సందర్భంగా కడప ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డిలు మాట్లాడుతూ ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ అని తెలిపారు. ఎల్ఐసీని ప్రభుత్వరంగ సంస్థగా మరింత బలోపేతం చేయాలని, ఇన్సూరెన్స్ పొదుపు మొత్తాలకు ప్రత్యేకంగా ఆదాయం పన్ను రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని సంతకాలు చేసిన వారిలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగసుబ్బారెడ్డి, సెరికల్చర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట రామరాజు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓబులేసు, పెన్షనర్ల సంఘం నేతలు శంకరరావు, సుధీకర్, చంద్రశేఖర్ రెడ్డి, ఎల్ఐసి యూనియన్ల నేతలు పాల్గొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్ర పోటీలు



రాజుపాలెంలో విజేతలకు కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ వెంకటరెడ్డి

రాజుపాళెం : గత నెల 26న ప్రారంభమైన ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలు శుక్రవారంతో ముగిశాయి. రాజుపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ విజయవంతంగా ముగిసిందన్నారు. ఇక్కడ మండల స్థాయిలో గెలిచిన క్రీడాకారులంతా నియోజకవర్గ పరిధిలో జరిగే పోటీల్లో పాల్గొనాలని ఆయన చెప్పారు. క్రికెట్‌లో ఏరువపాలెం, వాలీబాల్‌లో రాజుపాళెం, బాల్‌బ్యాడ్మింటన్ పురుషులు, మహిళల విభాగంలో రాజుపాళెం, కబడ్డీలో రాజుపాళెం, ఖోఖోలో కొర్రపాడు జట్లు విజేతలుగా నిలిచాయన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడీలు పాల్గొన్నారు.

రేపు కడప నగరంలో మహా శోభాయాత్ర

కడప కల్చరల్ : అయోధ్య ఐక్య వేదిక ఆధ్వర్యంలో కడప నగరంలో ఈనెల 21వ తేదీన శ్రీ రామ మహాశోభాయాత్ర నిర్వహించనున్నట్లు వేదిక ప్రతినిధులు తెలిపారు. ఈ శోభాయాత్ర చిన్నచౌకు ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఉదయం 7 గంటలకు ప్రారంభమై అప్సర సర్కిల్, వై-జంక్షన్, ఆర్టీసీ సర్కిల్, ఎస్పీ బంగ్లా, రాజారెడ్డివీధి, అన్నమయ్య సర్కిల్, కృష్ణా సర్కిల్, గోకుల్ సర్కిల్, వన్‌టౌన్ సర్కిల్, పాత బస్టాండు సర్కిల్, ఏడురోడ్ల కూడలి, ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, ఐటీఐ సర్కిల్, కాగితాలపెంట, సంధ్య సర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్‌మార్గ్ మీదుగా హౌసింగ్‌బోర్డు కాలనీలోగల శ్రీ కోదండ రామాలయం వద్ద ముగుస్తుందన్నారు. అలాగే 22వ తేది ఉదయం 6 గంటలకు శ్రీరామ హోమం, ఆ తర్వాత భక్తుల స్వహస్తాలతో శ్రీ రామలక్ష్మణ, సీతా, ఆంజనేయుల విగ్రహాలకు అభిషేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అయోధ్యలో రామప్రతిష్ఠ జరిగే సమయంలో ఆలయంలో స్క్రీన్ ఏర్పాటు చేసి భక్తులకు ప్రతిష్ఠ కార్యక్రమం ప్రదర్శించే ఏర్పాట్లు చేశామన్నారు.

ఆహార ఉత్పత్తులపై అవగాహన

పులివెందుల రూరల్/లింగాల : పట్టణంలోని ఆహార సాంకేతిక కళాశాల ఆధ్వర్యంలో లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా 7 రోజుల పాటు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం గ్రామంలో పండ్లు, చిరుధాన్యాలు, కూరగాయలు ఆధారిత ఉత్పత్తులు, తయారీ వ్యవసాయ, ఉద్యానపంటలు, పశుపోషణ తదితర అంశాలపై సర్వే నిర్వహించారు. జాతీయ సేవా పథకం అధికారి నజ్మా, డీన్ఎంఎస్ బేగ్‌లు రైతులు అధికారుల సూచనలు, సలహాలు జాగ్రత్తగా పాటించాలన్నారు.

అధిక దిగుబడులను ఇచ్చే విత్తనాలను వాడాలి

జమ్మలమడుగు : రైతులు అధిక దిగుబడులను ఇచ్చే విత్తనాలను వాడాలని వ్యవసాయశాఖ శిక్షణ కేంద్రం ఏఈ శైలజ తెలిపారు. శుక్రవారం మండలంలోని శేషారెడ్డిపల్లె గ్రామంలో రైతులకు పంటలు సాగుబడి చేసే విధానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ మండలాల్లో పంట సరళిని బట్టి విడుదలైన నూతన విత్తన రకాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు సాగుచేసిన శనగ పంట సక్రమంగా దిగుబడులు రాకపోతే అంతర పంటగా ధనియాలు, అవాలను వేసుకోవాలని సూచించారు.

హుండీ ఆదాయం లెక్కింపు



నగదు లెక్కిస్తున్న మఠం సిబ్బంది

బ్రహ్మంగారిమఠం : కందిమల్లాయపల్లెలోని శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో శుక్రవారం హుండీ ఆదాయం లెక్కించారు. పూర్వపు మఠాధిపతి ప్రథమ పుత్రుడు శ్రీ వెంకటాద్రిస్వామి, మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. నగదు రూ.37 లక్షల 15 వేల 145, బంగారు 8 గ్రాముల 750 మిల్లీ గ్రాములు, వెండి 475 గ్రాములు వచ్చిందని మఠం ఫిట్‌పర్సన్ తెలిపారు.